# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-11-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అంగోలా, బోట్స్‌వానా దేశాల పర్యటన నిమిత్తం రేపు బయలుదేరనున్నారు.
- వందేమాతరం గీతం ఒక మంత్రం, శక్తి, స్వప్నమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.
- మెట్రో కనెక్టివిటీలో భారత్ ప్రపంచంలోనే 3వ స్థానంలో ఉందని కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు.
- భారతీయ బ్యాంకులు గడచిన దశాబ్ద కాలంలో గణనీయంగా పరిణతి చెందాయని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అంగోలా, బోట్స్‌వానా దేశాల పర్యటన నిమిత్తం రేపు బయలుదేరనున్నారు. తొలిదశలో రాష్ట్రపతి అంగోలా అధ్యక్షులు జోవో మాన్యుయెల్ గొంకాల్వ్స్ లౌరెంకో ఆహ్వానం మేరకు ఆ దేశాన్ని సందర్శిస్తారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ఈ నెల 9వ తేదీన అంగోలా అధ్యక్షుడితో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అలాగే 11వ తేదీన అంగోలా దేశ స్వాతంత్ర్యం 50వ వార్షికోత్సవాలకు హాజరవుతారు. అంగోలా పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రెండవ దశలో భారత రాష్ట్రపతి బోట్స్‌వానా దేశాన్ని సందర్శించి, ఆ దేశ అధ్యక్షురాలు డూమా గిడియాన్ బోకూన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. బోట్స్‌వానా జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. భారతీయ సమాజ సభ్యులతో సంభాషించడంతో పాటు సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలను కూడా సందర్శించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత జాతీయగీతం వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాలను ప్రారంభించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి.. వందేమాతరం స్మారక స్టాంపును, నాణాన్ని,

vandemataram150.in పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వందేమాతరం ఒక మంత్రం, శక్తి, స్వప్నం అని వ్యాఖ్యానించారు. వందేమాతరం అంటే భారతమాత పట్ల భక్తి అని పేర్కొంటూ.. ఇది మనలను చరిత్రలోకి తీసుకెళుతుందని, అలాగే వర్తమానాన్ని ఆత్మవిశ్వాసంతో నింపుతుందని, భవిష్యత్‌లో సంకల్పాన్ని నెరవేర్చగలమనే ధైర్యాన్ని నింపుతుందన్నారు. బంకిం చంద్ర ఛటోపాధ్యాయ.. ఈ గీతం ద్వారా స్వతంత్ర, ఐక్య, సంపన్న భారత్ లక్ష్య సాధన కోసం పిలుపునిచ్చారన్నారు. ఆయన రాసిన ప్రతి పదానికి లోతైన అర్థం ఉందన్న ప్రధానమంత్రి.. వందేమాతరం గీతం ప్రతి యుగంలోనూ సందర్భోచితంగా ఉంటుందని వివరించారు. బంకిం చంద్ర విరచిత 'ఆనందమఠం' ఒక నవల మాత్రమే కాదని, అది స్వతంత్ర భారతదేశ స్వప్నమని నరేంద్ర మోదీ గుర్తు చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ కార్యక్రమంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మెట్రో కనెక్టివిటీలో భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా 3వ స్థానంలో ఉందని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొన్నారు. గురుగ్రామ్‌లో ఈరోజు జరిగిన 18వ అర్బన్ మొబిలిటీ ఇండియా కాన్ఫరెన్స్, ఎక్స్‌పో 2025లో ఆయన మాట్లాడుతూ.. భారతదేశ మెట్రో నెట్‌వర్క్ ఒక వెయ్యి 100 కిలోమీటర్లకు పైగా విస్తరించిందన్నారు. దీని ద్వారా దేశం ఇప్పుడు మెట్రో కనెక్టివిటీలో ప్రపంచంలోనే మూడో స్థానానికి చేరిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న భూగర్భ పైప్‌లైన్ కనెక్టివిటీ ప్రాజెక్ట్ పూర్తయ్యాక భారత్ అమెరికాను అధిగమించి ప్రపంచంలో రెండో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా అవతరిస్తుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ బ్యాంకులు గడచిన దశాబ్ద కాలంలో గణనీయంగా పరిణతి చెందాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ముంబైలో ఈరోజు జరిగిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకింగ్ అండ్ ఎకనామిక్స్ కాన్‌క్లేవ్ 2025లో ఆయన మాట్లాడుతూ.. 2018లో నష్టాల్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేడు 100 బిలియన్ డాలర్ల సంస్థగా అభివృద్ధి చెందిందని చెప్పారు. 27 ప్రభుత్వ రంగ బ్యాంకుల ఏకీకరణ, 2015లో ఆస్తి నాణ్యత సమీక్ష (AQR), ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (PCA) ఫ్రేమ్‌వర్క్, భారీ రీక్యాపిటలైజేషన్, దివాళా నియమావళి (IBC) వంటి నియంత్రణ చర్యలు మంచి ఫలితాలనిచ్చాయని, ఇవి భారతదేశ క్రెడిట్ విధానాన్ని సమూలంగా మార్చాయని పేర్కొన్నారు. దేశంలో బ్యాంకులు ఇప్పుడు బలంగా ఉన్నాయని, పర్యవేక్షణ మరింత అప్రమత్తంగా ఉందని, మార్కెట్ ఆధారిత రిస్క్ బదిలీ విధానాలు మరింత ప్రభావవంతంగా ఉన్నాయని ఆర్‌బిఐ గవర్నర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సాయంత్రం వారణాసి చేరుకున్నారు. వారణాసి ప్రజలు, పార్టీ కార్యకర్తలు ప్రధానమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటన సందర్భంగా, నరేంద్రమోదీ రేపు నాలుగు కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభిస్తారు. ఈ కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు బనారస్-ఖజురహో, లక్నో-సహరన్‌పూర్, ఫిరోజ్‌పూర్-ఢిల్లీ ఇంకా ఎర్నాకులం-బెంగళూరు మార్గాల్లో నడుస్తాయి. ఈ కొత్త రైళ్లు ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటుగా పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాల వృద్ధికి దోహదపడతాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

చట్ట విరుద్ధమైన అణు కార్యకలాపాలు, అక్రమ రవాణా, ఎగుమతి నిబంధనల ఉల్లంఘనలు మొదలైనవి పాకిస్థాన్ చరిత్రలోనే ఉన్నాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ విమర్శించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత్ ఎల్లప్పుడూ ఈ అంశాలను గమనిస్తూ.. అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకువెళుతోందని తెలిపారు. పాకిస్తాన్ అణు పరీక్షలకు సంబంధించి అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యను భారత్ గమనించిందని రణధీర్ జైస్వాల్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

గోవాలో జరగనున్న భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం - (IFFI) 2025 చలన చిత్రాలకు ప్రపంచ స్థాయి వేదికను అందిస్తుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ చలన చిత్రోత్సవంలో 81 దేశాల నుండి 240 చిత్రాలు ప్రదర్శించబడతాయన్నారు. IFFI 2025 వేదిక సృజనాత్మకతకు, ప్రపంచానికి వారధిగా పని చేస్తుందని, కృత్రిమ మేధ ఆధారిత కంటెంట్ కోసం ప్రత్యేక విభాగాన్ని కలిగి ఉందని పేర్కొన్నారు. మహిళలు దర్శకత్వం వహించిన 50కి పైగా చిత్రాలు ప్రదర్శించబడతాయని, ఇది ప్రభుత్వ నారీ శక్తి దార్శనికతకు మరింత ఊతమిస్తుందని ఎల్. మురుగన్ వివరిస్తూ....

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఐదు మ్యాచ్‌ల టీ-20 క్రికెట్ సిరీస్‌లో భాగంగా చివరి మ్యాచ్.. రేపు బ్రిస్‌బేన్ లోని గబ్బాలో భారత్  ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ మధ్యాహ్నం ఒంటి గంటా 45 నిమిషాలకు ప్రారంభం అవుతుంది. నిన్న జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ ఆస్ట్రేలియాపై 48 పరుగులతో విజయం సాధించి ఈ సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 311 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 95 పాయింట్ల నష్టంతో 83 వేల 216 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 17 పాయింట్ల నష్టంతో 25 వేల 492 వద్ద స్థిరపడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =